క్లుప్తంగా

ఎకరాకు 3 బస్తాల దిగుబడి



కేఓ అగ్రహారంలో పంటకోత ప్రయోగం చేస్తున్న ఏఈఓ శివకుమారి

కోటనందూరు: అపరాల (మినుము, పెసర) సాగులో ఎకరాకు మూడు బస్తాల దిగుబడి వస్తున్నట్టు గుర్తించామని వ్యవసాయ విస్తరణాధికారి కేవీ శివకుమారి తెలిపారు. మండలంలోని పాతకొట్టాం, కేఓ అగ్రహారం గ్రామాల్లో శనివారం అపరాల పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. నిర్దిష్ట కొలతల్లో పంటను ఒబ్బిడి చేసి సరాసరి పంట దిగుబడిని అంచనా వేశారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండడంతో అపరాల సాగులో మంచి దిగుబడులు వచ్చినట్లు ఏఈఓ వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు జి.రాంబాబు, రాజ్యలక్ష్మీజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వేలంకలో ప్రత్యేక అవసరాల గల పిల్లలతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కిర్లంపూడి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు (దివ్యాంగుల)పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సహిత విద్యా ఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు సూచించారు. హోమ్ బేసిడ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా శనివారం వేలంకలో ఐదుగురు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు విద్యను అందించే విధానాన్ని ఆయన పరిశీలించారు. పిల్లలకు ప్రభుత్వం అందించే సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేలంకలో జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ మెయిన్ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల వర్క్ బుక్‌లను తనిఖీ చేశారు. ఆయన వెంట ఐఈఆర్టీ ఉపాధ్యాయురాలు ప్రసన్న ఉన్నారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: మండలంలోని హంసవరం ఆదర్శ విద్యాలయం (ఏపీ మోడల్ స్కూల్)లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల మూడో తేదీ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఏప్రిల్ 21న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతి సిలబస్‌తో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు రూ.75 రుసుమును మార్చి 31వ తేదీలోపు నెట్ బ్యాంకింగ్‌లో క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా చెల్లించాలన్నారు. చెల్లించిన రుసుము జనరల్ నంబరు ఆధారంగా సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్ లేదా ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అర్హతలు

ఓసీ, బీసీ అభ్యర్థులకు 2012 సెప్టెంబర్ ఒకటి, 2014 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 2010 సెప్టెంబర్ ఒకటి, 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24లో ఐదో తరగతి చదువుతూ ఉండాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రత్తిపాడు: స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వద్ద శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థి ద్రోణంరాజు కిరణ్‌కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డీవీఎస్ రమేష్‌రాజు ప్రారంభించారు. వైద్య సిబ్బంది చిరు వ్యాపారులు, క్వారీ కార్మికులు, తోపుడు బళ్ల కార్మికులు, ఆటో డ్రైవర్లకు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఇంజినీర్ మోహన్, కళామందిర్ కమిటీ అధ్యక్షుడు మూరా చిన్నిబాబు (రాజా), మాజీ సర్పంచ్ మూరా చంటి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఇందన ఏసుబాబు, తాతా సాంబు, ఏడిద రెడ్డినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న కొంజెర్ల కృష్ణ కుటుంబానికి శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులను శనివారం పంపిణీ చేశారు. దాతలు జ్యోతుల నవీన్, రావి రామ్‌శివ శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా రూ.10 వేలు, నిత్యావసర వస్తువులను రావి వెంకట్ చేతుల మీదుగా కృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు నేమాల శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, శేషగిరి, యాదాల శ్రీను, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజాపోరు యాత్ర

ప్రత్తిపాడు: గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు శింగిలిదేవి సత్తిరాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అట్టడుగువర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలుపించాలని కోరారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

400 గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక

- వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్
- 5న జరిగే 'సిద్ధం' సభను విజయవంతం చేయాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జి సునీల్



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు: వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని 400 గ్రామాలను దత్తత తీసుకుని, రూ.400 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్ తెలిపారు. ప్రత్తిపాడు అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో ఈ నెల 5న జరిగే 'సిద్ధం' సభ విజయవంతంపై స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. చలమలశెట్టి సునీల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో బేసిక్ స్కిల్స్ లేకపోవడంతో ఎందరో విద్యావంతులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారన్నారు. వారందరికీ ఉద్యోగ కల్పనకు స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం ఏర్పాటు చేస్తామన్నారు. పారిశ్రామిక వేత్తలను జిల్లాకు రప్పించి, ఐదేళ్లలో రూ.40 వేల కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగాలను కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నెల 5న జరిగే సిద్ధం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 100 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలు, చేసిన అభివృద్ధిని చూపి ఓటు అడిగే నైతిక హక్కు వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సిద్ధం సభకు ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ప్రత్తిపాడు, రౌతులపూడి జెడ్పీటీసీలు బెహరా రాజరాజేశ్వరి, గొల్లు చినదివాణం, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, అన్నవరం ట్రస్ట్‌బోర్డు మెంబర్ దోశి చిట్టిబాబు, లింగంపర్తి, పెదశంకర్లపూడి సొసైటీ అధ్యక్షులు వరుపుల సూరిబాబు, దోశి హరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు బెహరా దొరబాబు, ఏడిద రెడ్డినాయుడు, కొండపల్లి అప్పారావు, దడాల సతీష్, అడపా సోమేష్, బెహరా దొరబాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ కన్వీనర్లు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



గుర్రంపాలెంలో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గుర్రంపాలెం, రాజపూడి గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌లను శనివారం ఎమ్మెల్యే చంటిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలు గ్రామాల్లో నూతన వాటర్ ట్యాంకులు ప్రారంభించి తాగునీటిని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జనపరెడ్డి బాబు, తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన



ఏవీ నగరం, రావికంపాడు రైతులతో మాట్లాడుతున్న జేడీఏ విజయ్‌కుమార్

తొండంగి: మండలంలోని ఏవీ నగరం, కోదాడ, రావికంపాడు తదితర ప్రాంతాల్లో వరి పొలాలను జేడీఏ ఎన్.విజయకుమార్ శనివారం పరిశీలించారు. వరిపొలాలకు సాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు జేడీఏ ఆధ్వర్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో వరిపొలాలను పరిశీలించారు. పీబీసీ కెనాల్ ద్వారా సాగునీటిని ప్రవాహం పెంచాలని ఆయకట్టు రైతులు కోరారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులతో జేడీఏ విజయ్‌కుమార్ సాగునీటి విడుదలపై చర్చించారు. కాలువలకు నీటి విడుదలను పెంచాలని సూచించారు. అలాగే కోదాడ రైతులు కూడా తమ పొలాలకు సాగునీటి ఇబ్బంది రాకుండా చూడాలని కోరడంతో పంపా కెనాల్ డీ 4 చానల్ ద్వారా సాగునీటిని అందించేందుకు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట ఏఓ ఎస్.నరసింహం, ఏఈఓ కొప్పన దైవ ప్రసాద్, ఇతర అధికారులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీకి విశేష ప్రజాదరణ

- ఎమ్మెల్సీ అనంతబాబు, కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- ఏలేశ్వరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఏలేశ్వరంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, వరుపుల

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీకి అన్నివర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ వస్తోందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. పట్టణంలోని 1, 18, 20 వార్డుల్లో శనివారం వారు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికీ చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. తొలుత జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, తొండారపు రాంబాబు, మసిరపు నాగేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, దోశి కిషోర్, పైల విజయ్‌కుమార్, మలకల వేణు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు



ఏలేశ్వరంలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా ఇంటర్మీడియెట్ సెకండియర్ పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఏలేశ్వరం పట్టణంలో మొత్తం 565 మంది విద్యార్థులకు గాను 16 మంది గైర్హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 290 విద్యార్థులకు గాను 281 మంది, గురుకుల కళాశాలలో 275 మంది విద్యార్థులకు గాను 268 మంది పరీక్షలు రాశారు. ఉదయం నుంచి 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. గురుకుల కళాశాలకు పరీక్షల చీఫ్ సూపరింటిండెంట్‌గా జయలక్ష్మి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా ఎ.ప్రతాప్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చీఫ్ సూపరింటిండెంట్‌గా కె.బాబ్జీ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా పి.రామకృష్ణ వ్యవహరించారు.


సత్యదేవుని దర్శించిన ఎస్‌పీఎఫ్ ఐజీ త్రివిక్రమ్ వర్మ



ఎస్‌పీఎఫ్ ఐజీ త్రివిక్రమ్ వర్మకు సత్యదేవుని ఫొటో అందజేస్తున్న ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం: స్పెషల్ పొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) ఐజీ త్రివిక్రమ్ వర్మ కుటుంబ సమేతంగా శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ఎస్‌పీఎఫ్ సిబ్బంది పనితీరుపై ఐజీ త్రివిక్రమ్‌వర్మ ఈఓతో చర్చించారు. ఆలయ ఏఈఓ కృష్ణారావు, సూపరింటిండెంట్ కృష్ణ ప్రసాద్, రిసెప్షన్ సీనియర్ అసిస్టెంట్ గణపతి, అన్నవరం ఎస్ఐ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



రత్నగిరిపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారిని తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించి ప్రధానాలయానికి చేర్చారు.

పల్స్‌పోలియోకు సర్వం సిద్ధం

- నేడు ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



పెరుమాళ్లపురంలో అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గోకవరం: మండలవ్యాప్తంగా ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియోకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తిరుస్ తెలిపారు. మండలంలో మొత్తం 6,412 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యమన్నారు. ఇందుకోసం 41 బూత్‌లు, 174 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. తల్లిదండ్రులు విధిగా ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు పల్స్ పోలియోను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ

తొండంగి: మండలవ్యాప్తంగా ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పెరుమాళ్లపురంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని నినాదాలు చేశారు. అన్ని గ్రామాల్లోనూ పిల్లలకు ఆరోగ్య సిబ్బంది చుక్కల మందు వేస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి

కిర్లంపూడి: ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.అరుణ సూచించారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి పీహెచ్‌సీల పరిధిలో 44 పోలియో చుక్కల కేంద్రాలు, 3 మొబైల్ రూట్‌ల ద్వారా పిల్లలకు ఆదివారం ఉదయం నుంచి పోలియో చుక్కలు వేస్తారన్నారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల ఏళ్ల లోపు పిల్లలను పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

వైభవంగా పరదేశమ్మ ఆలయ వార్షికోత్సవం



కొత్తసూరవరంలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: మండలంలోని కొత్త సూరవరంలో వేంచేసిన పరదేశమ్మ ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. పరదేశమ్మ బాలభక్త వినాయక సంఘం (ఆలయ కమిటీ) ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మహాన్నసమారాధన నిర్వహించారు. స్థానిక పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వేముల శివనారాయణ, మాజీ అధ్యక్షుడు గంటా చక్రరావు, కార్యదర్శి పైలా వెంకటరమణ, కోశాధికారి చవితిన సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

గోకవరం: స్థానిక ఊరకాలువ గట్టుపై వేంచేసిన అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న సాయిబాబా ఆలయానికి విశ్వహిందూ పరిషత్ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.2 లక్షల విరాళం అందజేశారు. అలాగే ఆలయ శ్లాబ్ నిర్మించడంతో కమిటీ సభ్యులు, భక్తులు ఆయనను అభినందించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా దుర్గమ్మ జాతర

గండేపల్లి: తాళ్లూరు పోలవరం గట్టుపై వేంచేసిన దుర్గమ్మ అమ్మవారి జాతర శనివారం వైభవంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాల నడుమ గ్రామంలోని మహిళలు ఊరేగింపుగా ఇంటింటికీ అమ్మవారిని తీసుకువెళ్లారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



ఏలేశ్వరంలో దివ్యాంగుడు వీరగణేష్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మీనారాయణ

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా శనివారం రెండోరోజు సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. గ్రామ వలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ల సొమ్ము అందజేశారు. పట్టణంలోని 2వ వార్డులో దివ్యాంగుడు ఆకుల వీర గణేష్‌కు వలంటీర్ లక్ష్మీనారాయణ పింఛన్ అందజేశాడు. ఇంటి వద్దకే పింఛన్ అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కంప్యూటర్ శిక్షణా తరగతులు ప్రారంభం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులను శనివారం ప్రారంభించారు. కంప్యూటర్ విద్యపై 60 రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తామని అరబిందో ఫార్మా ఫౌండేషన్ మేనేజర్ డి.సుధాకర్ తెలిపారు. విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మెహర్, పి.ఫణీంద్ర, కేవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆర్థిక అక్షర కేంద్రాల ఏర్పాటు




ప్రత్తిపాడు సదస్సులో మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ విభాగాధిపతి సాయి మనోహర్

ప్రత్తిపాడు: బ్యాంకు సేవలపై అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలోనూ ఆర్థిక అక్షర కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ విభాగాధిపతి (రీజినల్ హెడ్) సాయి మనోహర్ తెలిపారు. ప్రత్తిపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎన్‌జీఓల ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంకుల ద్వారా రూ.50 వేల నుంచి రూ.50 కోట్ల వరకూ ముద్రా రుణాలు పొందవచ్చన్నారు. రూ.40 లక్షల వరకూ ఎటువంటి సెక్యూరిటీ లేకుండా ఎడ్యుకేషన్ రుణాలు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన వంటి ఇన్సురెన్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు ఆర్థిక సేవలపై అవగాహన కల్పించేందుకు 77 కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రోజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ అశోక్‌కుమార్, స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ చందన్‌కుమార్, వైఎస్సార్ కాంతి పథం ఏపీఎం వై.వెంకట్, స్టేట్ కో ఆర్డినేటర్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రత్తిపాడు: ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురంలో బీజేపీ పతాకాన్ని అవమానించిన దుండగులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. నిందితులను తక్షణమే అరెస్టు చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు కందా వీరస్వామి, పార్టీ నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, కొల్లా శ్రీనివాస్, మదినే బాబ్జి తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకుడు రంగారావు

ఏలేశ్వరం: విద్యార్థి దశ నుంచే పొదుపు, ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని కాకినాడ పీఆర్ కళాశాల అధ్యాపకుడు జె.రంగారావు సూచించారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శనివారం గెస్ట్ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతిఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. పొదుపు చేసిన డబ్బును పెట్టుబడిగా వాడాలన్నారు. పొదుపును పెట్టుబడిగా మారిస్తే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అవసరం మేరకే డబ్బును ఖర్చు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చిన్నారావు, కామర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ రామారావు, అధ్యాపకులు బంగార్రాజు, మదీనా, వీరభద్రరావు, శ్రీలక్ష్మి, మేరీ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి

రౌతులపూడి: మండలంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు ఆమోదం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.ప్రేమసాగర్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌పై చర్చించారు. ఐసీడీఎస్, వ్యవసాయ, విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి, పంచాయితీరాజ్ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. గతేడాది సాధారణ నిధుల నుంచి వచ్చిన రూ.28.51 లక్షలను వివిధ పనులకు కేటాయించారు. 24–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.90,000 మిగులుతో బడ్జెట్‌ను ఆమోదించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రాయి వెంకటలక్ష్మి, ఎస్.సాయి, కె.పల్లయ్య, బొడ్డు రాజు, సర్పంచులు సర్నం శ్రీనివాసు, వడాల సత్యనారాయణ, మిరియాల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కత్తిపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో శనివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

6,284 ఎకరాల్లో ఈ–పంట నమోదు



గోకవరం రైతు భరోసా కేంద్రంలో రైతుల జాబితా ప్రదర్శిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

గోకవరం: మండలంలో రబీ సాగుకు సంబంధించి 6,284 ఎకరాల్లో ఈ–పంట నమోదు పూర్తయినట్టు మండల వ్యవసాయాధికారి రాజేశ్వరి తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో శనివారం రైతుల వివరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రదర్శించిన జాబితాలో రైతులు తమ సర్వే నంబర్, ఖాతా నంబర్, పంట రకం, విస్తీర్ణం వివరాలు పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 5వ తేదీ లోగా సరి చేయించుకోవాలన్నారు. రైతుల అభ్యంతరాలపై క్షేత్ర పరిశీలన చేసి మార్పులను ఆమోదించి తుది జాబితా ప్రకటిస్తామన్నారు. తుది జాబితా ప్రకారం పంట కొనుగోలు, బీమా, ఇతర పథకాలు వర్తిస్తాయని తెలిపారు.